సాక్షి
అనంతపురం
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



**చీనీ టన్ను రూ. 20 వేలు**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.13**

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13, కనిష్టం రూ.3.50, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
**38.5°/ 23.2°**

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

## న్యూస్‌రీల్

### జిల్లాకు కొత్తగా 12,570 ఈవీఎంలు



ఈవీఎంలను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జిల్లాకు కొత్తగా 12,570 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) వచ్చాయి. వాటిని శనివారం అనంతపురంలోని పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని గోడౌన్‌లో భద్రపరిచారు.ఈ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. బెంగళూరులోని బెల్ కంపెనీ నుంచి ఇవి వచ్చాయని జేసీ తెలిపారు. ఇందులో 7,070 బ్యాలెట్ యూనిట్లు, 5,500 కంట్రోల్ యూనిట్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్‌డీఓ మధుసూదన్, ఎన్నికల డీటీ కనకరాజు పాల్గొన్నారు.

### సెలవులో జిల్లా ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు రెండు రోజుల పాటు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవులో వెళ్లినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సోమవారం తిరిగి విధుల్లోకి రానున్నట్లు తెలిసింది. అప్పటిదాకా అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి కొనసాగనున్నారు.

### 'ఓపెన్ డిగ్రీ' అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాప్తాడు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ గ్రూపుల్లో ప్రథమ సంవత్సర ప్రవేశ దరఖాస్తు గడువును ఈ నెల 5 వరకు పొడిగించినట్లు మహిళా అభ్యసన సహాయ కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.లక్ష్మీరంగయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 20 వరకు, రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, నర్సింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 94901 21294 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### అనంతకు నేడు విహారి

అనంతపురం: భారత క్రికెటర్ హనుమ విహారి ఆదివారం అనంతపురం నగరానికి రానున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వైజాగ్‌లో జరిగిన ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో విహారి కెప్టెన్‌గా ఉన్న రాయలసీమ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టు ఆటగాళ్లను స్థానిక ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటరులో ఘనంగా సత్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి హనుమ విహారితో పాటు వైస్ కెప్టెన్ గిరినాథ రెడ్డి, ఎమర్జింగ్ ప్లేయర్ కోగటం హనీష్ వీరారెడ్డి, రంజీ ప్లేయర్ అభిషేక్ రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు రాయలసీమ కింగ్స్ సీఈఓ నాగభూషణరెడ్డి తెలిపారు.

### సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక



కె.భావనా రెడ్డి



కె.మమత

అనంతపురం: మంగళగిరిలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నిలో పాల్గొనే సౌత్‌జోన్ జట్టుకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కె.భావనా రెడ్డి, కె.మమత ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.మధు ఆచారి తెలిపారు. నార్పల మండలం బండ్లపల్లికి చెందిన భావనా రెడ్డి లెఫ్ట్ ఆర్మ్ మీడియం పేసర్. 2022–23 సీజన్‌లో ఆంధ్ర అండర్–19 జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆరు వికెట్లు సాధించింది. పెనుకొండకు చెందిన మమత కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్, రైట్ ఆర్మ్ స్పిన్నర్. గతంలో జరిగిన అంతర్ జిల్లాల మ్యాచుల్లో విశేష ప్రతిభ చాటింది.

# ప్రతి మదిలో రాజన్న

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- రైతు బాంధవుడి సేవలను కొనియాడిన మంత్రి ఉషశ్రీచరణ్
- అనంతపురంలో ఘన నివాళులు అర్పించిన ఎంపీలు తలారి రంగయ్య, మాధవ్, ఎమ్మెల్యే అనంత
- బీకేఎస్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



బుక్కరాయసముద్రం మండలం ముసలమ్మ కట్ట సర్కిల్‌లో నూతనంగా ఆవిష్కరించిన వైఎస్సార్ విగ్రహం



బ్రహ్మసముద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్ తదితరులు



ముసలమ్మ కట్ట సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా

అనంతపురం క్రైం: పేదల పెన్నిధి, రైతు బాంధవుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి జిల్లా ప్రజలు ఘన నివాళులర్పించారు. ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితాల్లో తీసుకొచ్చిన గొప్ప మార్పును స్మరించుకున్నారు. భౌతికంగా ఆయన లేకున్నా..ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు తదితర వాటిని పంపిణీ చేశారు. అన్నదాన, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పాలుపంచుకున్నారు.

- కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి మంత్రి ఉషశ్రీ చరణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల పక్షపాతి వైఎస్సార్ అని కొనియాడారు. రైతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన అడుగు జాడల్లో సీఎం జగన్ నడుస్తున్నారన్నారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్ పార్కులో ఉన్న మహానేత విగ్రహానికి మునిసిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ తదితరులు నివాళులర్పించారు. సీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్లు, జ్యూస్ పంపిణీ చేశారు.
- అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో, జెడ్పీ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు నివాళులర్పించారు.
- రాయదుర్గంలోని వైఎస్సార్ విగ్రహానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై ర్యాలీగా వెళ్లి, ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని ముసలమ్మకట్ట వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు పాల్గొని.. రాజన్న సేవలను కొనియాడారు.
- తాడిపత్రిలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ గ్రామీణ పార్కులో యువనాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.
- గుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి, అపోలో సర్కిల్‌లోని విగ్రహానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. గుత్తి గాంధీచౌక్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ తదితరులు నివాళులర్పించారు.
- ఉరవకొండలో కార్పొరేషన్ల డైరెక్టర్లు జోగి వెంకటేష్, గోవిందు, పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి ర్యాలీ నిర్వహించారు. క్లాక్‌టవర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి ఆధ్వర్యంలో కొనకొండ్లలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి.. మహానేత సేవలను స్మరించుకున్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోనూ పార్టీ నేతలు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రాజన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా



రాయదుర్గంలో అన్నదానం చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



తాడిపత్రిలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



గుంతకల్లులో రాజన్న విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

# ఖరీఫ్‌ను దెబ్బతీసిన 'ఆగస్టు'

- ఐదేళ్లలో తొలిసారి మొహం చాటేసిన 'నైరుతి'
- సాధారణం కన్నా 35 శాతం తక్కువ వర్షపాతం
- ఆశలన్నీ ప్రత్యామ్నాయం, రబీ వ్యవసాయంపైనే
- పక్కనున్న కర్ణాటక, తెలంగాణలోనూ వర్షాభావం



అనంతపురం అగ్రికల్చర్: వరుసగా నాలుగేళ్ల పాటు కరువుతీరేలా కుండపోత వర్షాలు కురిపించిన వరుణుడు ఐదో ఏడాది కాస్త విరామం తీసుకున్నాడు. ఈ ఏడాది ఆలస్యంగా ప్రవేశించిన కీలకమైన నైరుతి రుతుపవనాలు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఐదేళ్లలో తొలిసారిగా కాస్త కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. అనంతపురం, ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు..నిత్యం వర్షాలు కురిసే బెంగళూరులో కూడా వాన కరువైంది. రెండుమూడేళ్లుగా హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షాలు ఈ సారి కనిపించలేదు. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో ఈ సారి నైరుతి ప్రభావం చూపకపోవడంతో ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు.

**35 శాతం తక్కువగా వర్షపాతం**

2019 ఖరీఫ్ నుంచి 2022 ఖరీఫ్ వరకు నాలుగేళ్ల వద్దన్నా వర్షాలు 'అనంత'ను ముంచెత్తాయి. 31 మండలాల్లోనూ సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. వాగులు, వంకలు, చెక్ డ్యాంలు పొంగాయి. చెరువులు నిండిపోయాయి. దశాబ్దాల పాటు ఎండిపోయిన నది పరీవాహక ప్రాంతాలు కూడా జలకళ సంతరించుకున్నాయి. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి తేలికపాటి వర్షాలకే పరిమితయ్యాయి. జూన్‌లో 61 మి.మీ గానూ 25 శాతం తక్కువగా 45.8 మి.మీ, జూలైలో 63.9 మి.మీ గానూ 15 శాతం తక్కువగా 73.3 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ గానూ 83 శాతం తక్కువగా 13.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఓవరాల్‌గా గత మూడు నెలల కాలంలో 210.1 మి.మీ గానూ 35 శాతం తక్కువగా 135.1 మి.మీ నమోదైంది. 20 వర్షపు రోజులు నమోదైనా భారీ వర్షాలు లేనందున కొంత ఇబ్బందికరంగా మారింది.

**దెబ్బతీసిన ఆగస్టు వర్షాలు**

ప్రధానంగా పంటలు కీలకదశలో ఉన్న ఆగస్టులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. సాధారణం కన్నా ఏకంగా 83 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో 3.70 లక్షల హెక్టార్లకు గానూ 67 శాతంతో 2.50 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగైన ఖరీఫ్ పంటలు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. చాలా ప్రాంతాల్లో పంటలు వాడుముఖం పట్టడంతో రైతుల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. అవకాశం ఉన్న ప్రాంతాల్లో నీటి తడులు (ప్రొటెక్టివ్ ఇరిగేషన్) ఇచ్చుకుంటే మంచిదని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పెద్దవడుగూరు, గుమ్మఘట్ట, శింగనమల, డి.హీరేహాళ్, రాయదుర్గం, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. ఇక 22 మండలాల్లో సాధారణం కన్నా 20 నుంచి 59 శాతం తక్కువగా వర్షపాతం నమోదు కాగా, మిగిలిన శెట్టూరు, పెద్దపప్పూరు మండలాల్లో 60 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది.

**వర్షం వస్తే ప్రత్యామ్నాయం, రబీకి ఊరట**

రాగల ఐదారు రోజుల్లో వర్షాలు పడే సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు ప్రకటించడంతో 1.10 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయం, ఆ తర్వాత అక్టోబర్‌లో 1.25 లక్షల హెక్టార్లలో రబీ సాగుకు ఊరట లభించే పరిస్థితి నెలకొంది. ఈ వారంలో మోస్తరుగా వర్షాలు కురిసినా ఖరీఫ్‌లో సాగైన 2.50 లక్షల హెక్టార్ల పంటలు కూడా కోలుకునే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అలాగే ఉలవ, పెసర, అలసంద, కొర్ర లాంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు కూడా ఢోకా ఉండదంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ–క్రాప్ ప్రామాణికంగా పంట కోత ప్రయోగాల ఫలితాలను బట్టి కొన్ని పంటలకు ఫసల్‌బీమా పథకం, వేరుశనగ, మరికొన్ని పంటలకు వాతావరణ బీమా పథకాలు ఉచితంగా అమలు చేస్తూ... ఏటా పారదర్శకంగా పరిహారం ఇస్తుండటంతో రైతులకు బీమా పథకాలు ధీమాను కల్పిస్తున్నాయి.

# పునః పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

- తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశం



రామినేపల్లిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమి

రాప్తాడు: తప్పుల్లేని ఓటరు జాబితా తయారీలో భాగంగా పునః పరిశీలన ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శనివారం ఆమె మండలంలోని మరూరు, రామినేపల్లి గ్రామాల్లో ఓటరు జాబితా పునః పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి నిబంధనలు సక్రమంగా పాటించారా? లేదా అని ఆరా తీశారు. సంబంధిత ఇంటి యజమానులు, బంధువులను పిలిచి మాట్లాడారు. మీ అంగీకారంతోనే ఓట్లు తీసివేశారా అని అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో గత ఏడాది జనవరి 6 నుంచి ఈ ఏడాది ఆగస్టు 9వ తేదీ వరకు మృతిచెందిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాలను పునః పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 96,153 డిలీషన్ (తొలగింపునకు) క్లెయిములు వచ్చాయని, వాటిని తిరిగి పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోపు ఎలాంటి లోటు పాట్లు లేకుండా పూర్తి చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

**ఇళ్ల నిర్మాణాలు వేగవంతం**

అనంతపురం అర్బన్: జిల్లాలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ ఎం.గౌతమి చెప్పారు. సామూహిక గృహప్రవేశాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పంటలకు నీటి లభ్యత, రెవెన్యూ, రీసర్వే, ఇళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సీఎస్ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమితో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. త్వరలో మెగా గృహప్రవేశాలు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తాడిపత్రి మండలం సజ్జలదిన్నె లేఅవుట్‌లో 265 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 165 పూర్తయ్యాయన్నారు. లే అవుట్‌లో తాగునీటి సరఫరా, కుళాయిల ఏర్పాటు, ఆర్చ్ నిర్మాణం, ఇళ్లకు రంగులు, తదితర పనులు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని హౌసింగ్ లే అవుట్లలోనూ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేశామన్నారు. ఉపాధి హామీ కింద సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, తదితర అన్ని పనుల వేగవంతానికి చర్యలు చేపట్టామన్నారు.

# 8లోపు బయోమెట్రిక్ వేయించాలి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే మైనార్టీ ఉపకార వేతనాల కోసం 2022– 23 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో ఈ నెల 8లోగా బయోమెట్రిక్ నమోదు చేయించాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బయోమెట్రిక్ నమోదులో సాంకేతిక సమస్యల పరిష్కారానికి కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్‌ఈలు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పర్యటిస్తారని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ పూర్తయిన విద్యార్థుల వివరాలను పరిశీలించి ఈ నెల 11లోగా జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఈ-పాస్ మిషన్‌లో పొగలు


కాలిపోయిన యంత్రం

శెట్టూరు: మండలంలోని పెద్ద బలంపల్లిలో రేషన్ సరుకులు అందిస్తుండగా ఈ-పాస్ మిషన్ నుంచి ఉన్నఫళంగా పొగలు వచ్చాయి. 35వ షాప్ ఎండీయూ ఆపరేటర్ మంజునాథ్ శనివారం ఉదయం ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఒక్కసారిగా పొగలు వెలువడ్డంతో భయపడిన ఆపరేటర్ వెంటనే దానిని నీళ్లలో పడేశాడు. అప్పటికే మిషన్ కాలిపోయింది. నిర్ణీత గడువు కంటే ఎక్కువ సేపు ఛార్జింగ్ పెట్టడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి.. కాలిపోయిన ఈ-పాస్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులకు సోమవారం నుంచి యథావిధిగా రేషన్ అందజేస్తామని పేర్కొన్నారు.

### యువకుడి దుర్మరణం


మృతుడు గోపాల్

గుత్తి రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన గోపాల్ (34) శుక్రవారం తొండపాడులో బంధువుల ఇంట జరిగే శుభకార్యానికి హాజరయ్యారు. అదే రోజు అర్ధరాత్రి కల్యాణమంటపం ఎదురుగా ఉన్న హోటల్ వద్దకు వెళుతుండగా తాడిపత్రి నుంచి గుత్తి వైపుగా బండల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో తలకు బలమైన గాయమై గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మధుమోహన్.. గుత్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

# నిహారిక.. సైక్లిస్ట్ శిఖరం


సైక్లింగ్ చేస్తున్న నిహారిక


ద గ్రేట్ హిమాలయన్ అల్ట్రా రేస్‌లో పాల్గొన్న నిహారిక


కుటుంబ సభ్యులతో నిహారిక

గార్లదిన్నె: రేస్ అంటే బైక్, కారు మాత్రమే కాదు.. సైక్లింగ్ చేయడం కూడా సాహసమే.. కొందరు సైకిల్ తొక్కడం సరదాగా నేర్చుకుంటే.. మరికొందరు సాహసం చేయడానికి వెనుకాడడంలేదు. అందులో గార్లదిన్నె మండలం తిమ్మంపేటకు చెందిన నిహారిక సాహసోపేత సైక్లింగ్ చేస్తూ పర్వతాలపైకి కూడా దూసుకెళ్తోంది. చిన్నతనం నుంచి ఆమెకు సైక్లింగ్‌పై ఆసక్తి ఉంది.. తల్లిదండ్రులు కూడా ఆమెను నిరుత్సాహపరచకుండా ప్రోత్సహించి, శిక్షణ ఇప్పించారు. ఆ స్ఫూర్తితో ముంబాయిలో సరదాగా సైక్లింగ్ నేర్చుకుని, దగ్రేట్ హిమాలయన్ అల్ట్రా రేస్‌ను పూర్తి చేసింది. 2020లో గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించి, కన్నవారితోపాటు తెలుగువారి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటుతోంది. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తిమ్మంపేటకు చెందిన భాస్కర్‌రెడ్డి, వాణి రెడ్డి దంపతులు 2005లో ముంబాయిలో వ్యాపారం చేయడానికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వీరికి నిహారిక రెడ్డి, లలిత్ సంతానం. కుమార్తె నిహారిక రెడ్డి చిన్నతనం నుంచి సైక్లింగ్‌పై ఆసక్తి పెంచుకోవడంతో తల్లిదండ్రులు కూడా ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించారు. దీంతో సైక్లింగ్ రేస్ అంటే సాహసోపేతమైనా అందులో తర్ఫీదు పొందింది. నిహారిక రెడ్డి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ముంబాయిలోనే చదివింది. ప్రస్తుతం అక్కడే ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ) చదువుతోంది. చిన్నతనంలో ఎలాంటి అనుభవం లేక పోయినా దాదాపు 700 కిలో మీటర్లు సైక్లింగ్ చేసి, అందరినీ ఆశ్చర్యపరిచింది. మొదటగా 2020లో అండర్ – 15 లో ముంబాయి – హైదరాబాద్ 656 కిలో మీటర్లు సైక్లింగ్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది.

**ఆర్‌ఏఎంకు అర్హత..**

నిహారికరెడ్డి 2022లో అండర్– 16 పుణె టు గోవా సైక్లింగ్ రేస్‌లో పాల్గొని, 652 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తి చేసింది. కోచ్ కబీర్ డెక్కన్, హిమాలయన్, రేస్‌లు పూర్తి చేసి ఆర్‌ఏఎంకు అర్హత సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ కబీర్ స్ఫూర్తితో ఆమె రోజూ 50 కిలో మీటర్లు సైక్లింగ్ చేస్తూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 26,27 తేదీల్లో ఇన్‌స్పైర్ ఇండియా నిర్వహించిన భారత్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక రేస్ దగ్రేట్ హిమాలయన్ అల్ట్రా రేస్‌లో పాల్గొని, లేహ్ నుంచి ద్రాస్ వరకు మళ్లీ ద్రాస్ నుంచి లేహ్ వరకు మధ్యలో కార్గిల్ వరకు 600 కిలో మీటర్లు 36 గంటల్లో రేస్ పూర్తి చేయాలని లక్ష్యంతో పాల్గొంది. సముద్ర మట్టానికి 10,350 మీటర్లు ఎత్తు లో ఈ రేస్‌ను 39 గంటల్లో పూర్తి చేసి, అందరినీ ఆశ్చర్యపరిచింది.

**ఆర్‌ఏఎం చేయడం లక్ష్యం**



ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక రేస్ అక్రాస్ అమెరికా (ఆర్‌ఏఎం) అల్ట్రా రేస్‌కు అర్హత సాధించి, స్వప్నం సాకారం చేసుకోవడమే లక్ష్యం. అందుకోసం రోజూ ఉదయం 5 గంటల నుంచి 7 వరకు దాదాపు 50 కిలో మీటర్లు సైక్లింగ్ చేస్తా. ఆదివారం దాదాపు 100 నుంచి 120 కిలో మీటర్లు సైక్లింగ్ చేస్తా. ఆర్‌ఏఎం రేసులో అమెరికా వెస్ట్ కోస్ట్ నుంచి ఈస్ట్ కోస్ట్ వరకు సుమారు 4,500 కిలో మీటర్లు దూరం ఉంటుంది. ఈ రేసులో పాల్గొనాలంటే డెక్కన్, హిమాలయన్ రేస్‌లు పూర్తి చేయాలి.

– నిహారిక, సైక్లిస్ట్

### చెట్టును ఢీకొన్న కారు

- ఐదుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన కారు

బత్తలపల్లి: చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం కునుకుంట్లలో శనివారం కొవ్వూరు సూర్యనారాయణరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమానికి అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన దంపతులు సరోజమ్మ, కొండారెడ్డి(కారు డ్రైవర్/ఓనర్), అనంతపురానికి చెందిన శివమ్మ (టీవీ టవర్), సావిత్రి (రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో టీచర్), పద్మావతి (మంగపట్నం) కారులో వెళ్లారు. శుభకార్యం ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డుపై ఏర్పడిన గుంతలోకి కారును నడపడంతో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### కరువు జిల్లాగా ప్రకటించాలి : సీపీఎం

అనంతపురం అర్బన్: జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అనంతను కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. శనివారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు వంద రోజుల అదనపు ఉపాధి పనులు కల్పించాలని విన్నవించారు. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలను రద్దు చేయాలన్నారు. పంట నష్టాలకు సంబంధించి ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని, ప్రైవేటు వడ్డీవ్యాపారుల ఒత్తిళ్ల నుంచి అన్నదాతలను కాపాడేందుకు ఆర్‌డీఓ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 4న జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### బ్యాంకు ఖాతాలోని నగదు మాయం!

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లికి చెందిన తల్లి హంసాదేవి, కుమారుడు నరేష్ బ్యాంకు ఖాతాల నుంచి రూ.50వేలు నగదు మాయమైంది. ఈ విషయాన్ని శనివారం గుర్తించిన బాధితులు తమ ఖాతాలున్న గుత్తి ఆర్‌ఎస్‌లోని స్టేట్ బ్యాంక్ అధికారులను కలిసి ఆరా తీశారు. ఆయా ఖాతాలను పరిశీలించిన అధికారులు హంసాదేవి ఖాతా నుంచి గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు రోజూ రూ.10వేలు చొప్పున రూ.40 వేలు.. నరేష్ ఖాతా నుంచి జూన్ 30న రూ.10వేలు మరో ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించారు. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారించి, బ్యాంక్ అధికారులు విచారణ చేపట్టారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు శనివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శుక్రవారం రాత్రి కల్లూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసుంటుందని నిర్ధారించారు. ధరించిన తెలుపు రంగు షర్ట్‌పై నీలం రంగు గీతలున్నాయి. ముదురు నీలం రంగు ప్యాంట్ వేసుకున్నాడు. గుండు చేయించాడు. ఆచూకీ తెలిసిన వారు 99088 37888, 85002 38200కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

## పీహెచ్‌సీల్లోనూ రక్త పరీక్షలు నిర్వహించండి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం క్రైం: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యుల సూచన మేరకు జ్వరపీడిత కేసులకు డెంగీ, మలేరియా తదితర వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు విధిగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి ఆదేశించారు. రోగ నిర్ధారణ పరీక్షలపై పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె సమీక్షించారు. ఓపీకి వచ్చే ప్రతి జ్వర అనుమానిత కేసుకూ ముందుగా రక్త పరీక్ష నిర్వహించాలన్నారు. డెంగీ కిట్ ద్వారా పరీక్షలు జరిపినప్పుడు వ్యాధి నిర్ధారణ జరిగితే రోగి సీరం సేకరించి జిల్లా కేంద్రంలోని కంటైనల్ సర్వైలెన్స్ ల్యాబ్‌కు పంపాలన్నారు. వివిధ వ్యాధుల నిర్ధారణ కోసం సేకరించిన రక్తపూతల్లో ఐదు శాతం నమూనాలను ల్యాబ్ కేంద్రానికి క్రాస్ చెక్ కోసం పంపాలన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యవారూ.. ఇదేమి తీరు?

- మహిళా ఉపాధ్యాయులతో అసభ్య ప్రవర్తన
- పాఠశాలకు ఆలస్యంగా వస్తూ పోకిరి వేషాలు


ఎంఈఓ1, 2కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు షాకీర్ బాషా తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి, మంచి నడవడిక నేర్పాల్సిన అయ్యవారే గతి తప్పి మహిళా ఉపాధ్యాయులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో ఈ టీచర్ మాకొద్దంటూ ఎంఈఓ 1, 2ను పిలిపించి పంచాయితీ నిర్వహించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు...

**విధులకు రోజూ ఆలస్యం**

ఉపాధ్యాయుడు షాకీర్ బాషా రోజూ విధులకు ఆలస్యంగా రావడమే కాక.. వచ్చినప్పటి నుంచి తరచూ ఏదో ఒక అంశంలో ఉపాధ్యాయులతో ఘర్షణ పడుతుండడం వివాదాస్పదమైంది. మహిళా ఉపాధ్యాయులతో అసభ్యకరంగా ప్రవర్తించడం, వారి వెనుక పాటలు పాడుతూ వెకిలి చేష్టలు చేస్తుండడంతో భరించలేక విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు.

**మాకొద్దంటే వద్దు**

షాకీర్ బాషా తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం పాఠశాలకు ఎంఈఓలు మల్లికార్జున, ఈరన్నను పిలిపించి పంచాయితీ నిర్వహించారు. సరైన సమయానికి పాఠశాలకు రాకపోవడంతో పాటు, వచ్చినప్పటి నుంచి మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సెల్‌ఫోన్లు ఇచ్చి మహిళా ఉపాధ్యాయుల ఫొటోలో తీయిస్తూ, వారి వెంట పడి పాటలు పాడుతూ వెకిలి చేష్టలకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తీరు వల్ల పిల్లలు చెడిపోతారని భయాందోళనలు వ్యక్తం చేస్తూ ఇక్కడి నుంచి పంపేయాలంటూ డిమాండ్ చేశారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం**

ఉపాధ్యాయుడు షాకీర్ బాషాపై కొన్ని రోజులుగా వివిధ రకాల ఫిర్యాదులు అందుతున్న మాట వాస్తవం. గతంలోనూ ఆయన ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం అదే తీరు కొనసాగిస్తూ తోటి ఉపాధ్యాయులతో గొడవ పడుతున్నట్లుగా తెలిసింది. గ్రామస్తులు మూకుమ్మడిగా ఫిర్యాదు చేసిన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. – మల్లికార్జున, ఎంఈఓ

## ద్విచక్ర వాహనాల ఢీ – ఇద్దరి మృతి

విడపనకల్లు: మండలంలోని హంచనహాల్ – పాలికి గ్రామాల మధ్య శనివారం రాత్రి ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు నివాసి బాలు (20), మరో వ్యక్తితో కలసి పాలికి గ్రామం వైపు మిరప పంటకు కాపలా ఉండేందుకు ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి బయలుదేరాడు. అదే సమయంలో పాలికి గ్రామానికి చెందిన వర్ధన్ (18), మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై కసాపురం వెళుతూ ఢీకొన్నారు. ఘటనలో బాలు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వర్ధన్‌ను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలిస్తుండగా గుత్తి సమీపంలో మృతిచెందాడు. ఎస్‌ఐ తిప్పయ్య నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

## మార్మోగిన హనుమాన్ నామస్మరణ


గుంతకల్లు రూరల్: ఐరావత వాహనంపై కొలువుదీరిన సీతారాముల ఉత్సవ మూర్తులు

గుంతకల్లు రూరల్/బొమ్మనహాళ్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మూడో శనివారం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. హనుమాన్ నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. వేకువజామునే ఆలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు, కసాపురంలో స్వర్ణ కవచ అలంకరణ, నేమకల్లులో వెండి కవచధారణ, బంగారు కిరీటధారణ, వెండి తమలపాకుల అలంకరణ, ఆకుపూజలు, లక్ష తులసి అర్చన పెద్ద ఎత్తున జరిగాయి. కసాపురంలో పెరవళి పారా రామన్న కుమారుల ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి అందజేశారు. నేమకల్లులో బళ్లారికి చెందిన జెల్లె హనుమంతప్ప, మీనాక్షమ్మ సౌజన్యంతో అన్నదానం ఏర్పాటు చేశారు. కసాపురంలోని బెల్దోణ సత్రంలో నిరంతర అన్నదానం కొనసాగింది. కసాపురంలో సాయంత్రం సీతారామ ఉత్సవ మూర్తులను ఐరావత వాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.


బొమ్మనహాళ్: తులసీ అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్


గుంతకల్లు రూరల్: భక్తులతో కిటకిటలాడుతున్న కసాపురం ఆలయం

## క్లుప్తంగా

### వైఎస్సార్ ఘాట్ సందర్శన



వైఎస్సార్ ఘాట్‌వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు అనంత, డాక్టర్ సిద్ధారెడ్డి, మేయర్ వసీం

**అనంతపురం క్రైం:** వైఎస్సార్ జిల్లా ఇడుపుల పాయలో ఉన్న మహానేత వైఎస్సార్ ఘాట్‌ను అనంతపురం, కదిరి ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, డాక్టర్ సిద్ధారెడ్డి, మేయర్ వసీం సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇస్సాక్, సైఫుల్లాబేగ్, జేసీఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గౌస్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్ కేంద్రం ఏర్పాటు

**అనంతపురం సిటీ:** అనంతపురం ఆదిమూర్తి నగర్‌లోని సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న వేమన టెలిఫోన్ భవన్‌లోని వినియోగదారుల సేవా కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా శనివారం ప్రారంభించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్త రిజిస్ట్రేషన్ సేవలను పొందొచ్చని తెలిపారు.

### నేత్రపర్వంగా బ్రహ్మ రథోత్సవం



రథం ముందు కళాకారుల సందడి

**అనంతపురం కల్చరల్:** రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు శనివారం ముగిశాయి. మొదటి రోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం స్వామి బృందావనానికి శ్రీగంధం సహిత విశేష పుష్పాలంకార సేవలు జరిగాయి. మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం కనులపండువగా జరిగింది. రాఘవేంద్ర స్వామి ఉత్సవ విగ్రహంతో పూల రథంపై నగరవీధుల్లో ఊరేగుతున్నప్పుడు భక్తులు హారతి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ బద్రీనాథ్, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నాగులచవితి

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు శనివారం నిర్వహించారు. మహిళలు ఆత్మకూరులోని సాయిబాబా ఆలయ ఆవరణలోని నాగుల విగ్రహాలు, అక్కమ్మ దేవతలకు పూజలు చేశారు.

### నేడు అన్నాభిషేకం

**ఆత్మకూరు:** పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథస్వామికి అన్నాభిషేకం చేస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకే కుంకుమార్చతో ప్రారంభమై, పంచామృతాభిషేకాలు, రాహుకేతు హోమాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

### అభాగ్యుడికి 'అమ్మ' ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

**అనంతపురం కల్చరల్:** నగర శివారులోని లెనిన్‌నగర్‌కు చెందిన సాకే పెద్దన్న ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. శస్త్రచికిత్స చేసినా మంచానికి పరిమితమయ్యాడు. 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. శనివారం బాధితుడు పెద్దన్న కుటుంబానికి రూ. 20 వేలు నగదు, రూ.30వేలు విలువజేసే సర్జికల్‌కాట్, వీల్ చైర్, ఎయిర్‌బెడ్, నిత్యావసర వస్తువులు అందించారు.

### నేడు బాల గోకులం

**అనంతపురం కల్చరల్:** శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను సంస్కార భారతి వారు సందడిగా ఆరంభం చేస్తున్నారు. చిన్నారి కృష్ణ, గోపిక వేషధారణలు, సాంస్కృతిక సంబరాలకు పాతూరులోని శృంగేరీ శంకర మఠం ఆధ్వర్యంలోని ప్రాచీన దత్తాత్రేస్వామి ఆలయం వేదిక కానుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు బాల గోకులం నిర్వహించనున్నట్లు సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి తెలిపారు.

# వైఎస్సార్ పాలన దేశానికే ఆదర్శం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత
- పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి
- ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లోనూ వర్ధంతి కార్యక్రమాలు
- పలుచోట్ల సేవా కార్యక్రమాల నిర్వహణ



జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహిస్తున్న ఎల్ఎం ఉమ



అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు



కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు



రాప్తాడులో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిత్రా వెంకటేష్

**అనంతపురం క్రైం:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పాలన ఆదేశానికే ఆదర్శమని ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ మరణం దేశవ్యాప్తంగా కోట్లాది మందికి శోకాన్ని ఇచ్చిందన్నారు.

**ప్రజల గుండెల్లో నిలిచిన వైఎస్సార్:**
ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అన్నారు. ఉమ్మడి ఏపీలో జలయజ్ఞం చేపట్టి అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. రాయలసీమకు అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా 2012 నుంచి కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది వైఎస్సార్ చొరవేనన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రాజారాం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లా బేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎర్రిస్వామి రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పెన్నోబులేసు, అనిల్‌కుమార్ గౌడ్, కృష్ణవేణి, రాధా, శోభారాణి, ఉష పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**జెడ్పీ కార్యాలయ ఆవరణలో..**
**అనంతపురం సిటీ:** జెడ్పీ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి శనివారం నివాళులర్పించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీలు రంగయ్య, మాధవ్, నగర మేయర్ వసీం , ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ లిఖిత, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గౌస్ బేక్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు సోము, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, మహిళా నాయకురాళ్లు, అన్ని కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు



రాప్తాడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**అనంతపురం రూరల్:** రుద్రంపేటలోని సచివాలయం - 2 వద్ద రుద్రంపేట పంచాయతీ సర్పంచ్ పద్మావతి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఎంపీటీసీలు నారాయణమ్మ, మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు వెంకటేష్‌నాయక్, రామ్మూర్తి, అక్కులప్ప పాల్గొన్నారు.

**స్ఫూర్తిప్రదాత వైఎస్సార్**
**అనంతపురం క్రైం:** వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రక్తదానం, అన్నదానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి హాజరయ్యారు. బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రాజారాం, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు మిద్దె నగేష్, తదితరులు పాల్గొన్నారు.

**లీగల్ సెల్ ఆధ్వర్యంలో:** వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. జాతీయ న్యాయవాదుల మండలి ఉపాధ్యక్షుడు ఆలూరు రామిరెడ్డి, న్యాయవాదులు హరినాథరెడ్డి, విద్యాపతి, నాగరాజ బాబు, గొని నాగన్న, సుజన, సాజిలాభాను, ఎస్కేయూ ఈసీ సభ్యులు ఇలియాస్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కల్చరల్:** వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని కళాకారులు నివాళులర్పించారు. స్థానిక లలిత కళా పరిషత్‌లో శనివారం రాత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కళాకారుడు సోమిరెడ్డి ఆధ్వర్యంలో నాటికలు ప్రదర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, నగర మేయర్‌వసీం, ఎల్కేపీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ పాల్గొన్నారు.

### చిరస్మరణీయుడు వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్

**రాప్తాడురూరల్:** వైఎస్సార్ పేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కొనియాడారు. జెడ్పీ ఆవరణలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

**రాప్తాడు:** స్థానికంగా వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్రా వెంకటేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. పీహెచ్‌సీలో వైద్యాధికారి శ్రావణి, ఆయుష్ వైద్యాధికారి మల్లేశ్వరి చేతుల మీదుగా బ్రెడ్లు, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, రాము, నారాయణ, నాగేష్, సింగారప్ప, రామచంద్రా రెడ్డి, వెంకట నారాయణ పాల్గొన్నారు.

**రాప్తాడురూరల్:** వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర నాయకులు జి.వెంకటరమణప్ప, గోవిందరెడ్డి, ఎ.గోపాల్ పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** మండల కేంద్రంతోపాటు గొరిదిండ్ల,తోపుదుర్తి, వేపచెర్ల , వేపచెర్ల తండా, తదితర గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి జరిపారు. వైస్ ఎంపీపీలు నీలిమ , విజయ్, సర్పంచ్ వరలక్ష్మి, మండల కన్వీనర్ బాలపోతన్న , మాజీ డీసీసీబీ డైరెక్టర్ వాసుదేవరెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వన్నూరప్ప, ఆతికిరెడ్డి, రామాంజి, అమర్‌నాథ్‌రెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో...



బ్రెడ్లు పంపిణీ చేస్తున్న లీగల్ సెల్ నాయకులు



రక్తదానం చేస్తున్న బీసీ సెల్ నేత రమేష్‌గౌడ్

## విద్యార్థుల గుండెచప్పుడు వైఎస్సార్



జేఎన్‌టీయూఏ పాలకభవనంలో ..

**అనంతపురం:** పేదల గుండె చప్పుడు వైఎస్సార్ అని ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య అన్నారు. శనివారం ఎస్కేయూలో వైఎస్సార్ వర్ధంతి జరి పారు. మాజీ రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.శంకర్ నాయక్ , పాలకమండలి సభ్యుడు మునినారాయణప్ప , బోధనేతర సంఘం మాజీ అధ్యక్షుడు టి. పురుషోత్తం రెడ్డి, బోధనేతర సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి , సెక్రటరీ శాంతలింగం, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ-2 సునీల్ దత్తా రెడ్డి, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

**జేఎన్‌టీయూలో:** జేఎన్‌టీయూ పాలకభవనంలో వైఎస్ఆర్ చిత్రపటానికి జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి ప్రొఫెసర్ సుజాత, ప్రొఫెసర్ పద్మసువర్ణ, ప్రొఫెసర్ వీబీ చిత్ర పాల్గొన్నారు.

- ఓటీపీఆర్ఐలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు జరిపారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్ పాల్గొన్నారు.
- జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణాకాంతి, విభాగాధిపతులు చంద్రమోహన్ రెడ్డి, ప్రొఫెసర్ భానుమూర్తి పాల్గొన్నారు.
- నగరంలోని కేంద్ర గ్రంథాలయం ఆవరణలో సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, కార్యదర్శి పి.రమ పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, మేయర్ వసీం



వైఎస్ వర్ధంతి సందర్భంగా సర్వజనాస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఓటీపీఆర్ఐలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్కేయూ క్యాంపస్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థి నాయకులు

## అమృత వనమాలి ఏర్పాటు

**అనంతపురం టవర్‌క్లాక్ :** దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమరయోధుల జ్ఞాపకార్థం దేశంలో అమృత వనమాలి ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు తెలిపారు. శనివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారిని స్మరించుకుంటూ, ఢిల్లీలో అమృత వనమాలి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 'మన మట్టి- మన దేశం' నినాదంతో ప్రతి గ్రామం నుంచి మట్టి, బియ్యం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ కార్యక్రమాన్ని మొదలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంధి రెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్ కుమార్, అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సాయిరామ్ ఆరోగ్య పరిస్థితిపై సతీమణితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

**రాప్తాడురూరల్:** ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై బెంగళూరులో చికిత్స పొందుతూ ఇంటికి చేరుకున్న డీఈఓ సాయిరాంను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. వైద్య చికిత్సల అనంతరం పూర్తి స్థాయిలో కోలుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు సూచించడంతో ఇంటికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శనివారం ఉదయం నివాసానికి వెళ్లి సాయిరామ్‌ను పరామర్శించారు. సతీమణి ఉమతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి వచ్చారంటూ డీఈఓ సాయిరామ్‌కు భార్య చెప్పగా, కళ్లు తెరిచి పలకరించే ప్రయత్నం చేశాడు. బాగున్నారా...అని విశ్వేశ్వరరెడ్డి డీఈఓను అడగ్గా, బాగున్నానంటూ బదులిచ్చారు. ప్రస్తుత జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ ఆఫీసర్లు, సిబ్బంది, పలువురు టీచర్లు నివాసానికి చేరుకొని సాయిరామ్‌ను పరామర్శించారు. సాయిరామ్ సతీమణి ఉమ మాట్లాడుతూ రోజురోజుకూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోందన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకుంటూ ఫిజియోథెరపీ చేయిస్తున్నామన్నారు. ఐదు రోజుల తర్వాత మరో మారు చెకప్‌కు హైదరాబాద్‌కు వెళ్తామన్నారు.

### ఆలమూరు లేఅవుట్ పరిశీలన

**అనంతపురం క్రైం:** నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి శనివారం ఆలమూరు లే అవుట్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తదితరులు ఉన్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎస్ఈ నాగమోహన్‌తో కలిసి సూర్యనగర్‌లో పర్యటించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి, పనులను వేగవంతం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

### ఇసుక ట్రాక్టర్ల సీజ్

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు త్రీటౌన్ సీఐ ధరణీ కిషోర్ శనివారం తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే ఉపేక్షించేదిలేదని ఎస్ఐ హెచ్చరించారు.

### వ్యక్తి అదృశ్యం

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** నగర పరిధిలోని ఐదోరోడ్డుకు చెందిన నగేష్ అనే వ్యక్తి నెల రోజులుగా కనిపించలేదని బాధిత కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఐదో రోడ్డుకు చెందిన నగేష్ తోపుడు బండిపైన చీరలు అమ్ముతూ జీవించేవాడు. నెలరోజుల క్రితం ఇంటి నుంచి వ్యాపార నిమిత్తం వెళ్లి, తిరిగి రాలేదు.

### ఏటీఎం దొంగల అరెస్టు

**గుత్తి:** పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో ఓ మహిళ ఏటీఎం కార్డు మార్చి రూ.10 వేలు అపహరించిన ఘటనలో హర్యానాకు చెందిన ముగ్గురు దొంగలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. గత నెల 31న తొండపాడు గ్రామానికి చెందిన పెద్దక్క అనే మహిళ ఎస్‌బీఐ ఏటీఎంలో కార్డు ద్వారా డబ్బు డ్రా చేస్తున్న సమయంలో హర్యానాకు చెందిన కొందరు కేంద్రంలోకి వచ్చి పెద్దక్కను ఏ మార్చి ఆమె ఏటీఎం అసలు ఏటీఎం కార్డు దొంగలించి రూ. 10 వేలు నగదును డ్రా చేసుకుని పరారయ్యారు. స్థానికుల సాయంతో సత్వేందర్ సింగ్ అనే దొంగను పట్టుకుని దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కారులో ఉడాయించిన వారిలో ప్రదీప్, కిర్షన్‌ను కర్నూలు టోల్ గేట్ వద్ద అదే రోజు అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గుత్తి పోలీసులకు అప్పగించారు. నిందితులను జడ్జి ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వెంకటరామిరెడ్డి చెప్పారు.

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్లకాలనీలో ఓ కిరాణాదుకాణంలో 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.కాలనీకి చెందిన మనోజ్‌కుమార్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. అందులో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. 21 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని, మనోజ్ కుమార్‌పై కేసు నమోదు చేశారు.

### ఆత్మకూరులో వర్షం

**ఆత్మకూరు:** మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లో శనివారం రెండు గంటలపాటు వర్షం కురిసింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు, ముందు సాగు చేసిన పంటలకు ఈ వర్షంతో కొంత ఊరట కలిగిందని రైతులు తెలిపారు.